RNI No :TELTEL2022/83073

# వేద న్యూస్ దినపత్రిక

వరంగల్ | శనివారం | పేజీలు : 4
సంపుటి : 3, సంచిక : 230 | ఆగస్టు 09, 2025 | వెల : రూ.3-00



హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

3లో..




# మాది పేదల సర్కార్

- అర్హులందరి సొంతింటి కల సాకారం
- రాష్ట్రవ్యాప్తంగా పురోగతిలో 3 లక్షల ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు
- అన్ని పట్టణాల్లో స్లమ్స్‌లోని బీదలకు హౌజెస్ నిర్మించే యోచనలో ప్రభుత్వం
- రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ, ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

**వేద న్యూస్, వరంగల్ ప్రతినిధి:**

తమది పేదల ప్రభుత్వమని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని సర్కారు పేదల అభివృద్ధి, సంక్షేమానికి కృషి చేస్తున్నదని రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ, ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్రంలో అర్హులైన ప్రతి నిరుపేద కుటుంబం సొంతింటి కలను ప్రజా ప్రభుత్వం నెరవేర్చుతుందని చెప్పారు. శుక్రవారం హనుమకొండలోని బాలసముద్రం అంబేడ్కర్‌నగర్‌లో జీ ప్లస్ త్రీ విధానంలో నిర్మించిన 592 రెండు పడక గదుల ఇండ్లను వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, ఎమ్మెల్సీ బస్వరాజ్ సారయ్య, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, నగర మేయర్ గుండు సుధారాణి, హనుమకొండ, వరంగల్ జిల్లాల కలెక్టర్లు స్నేహ శబరీష్, డాక్టర్ సత్య శారద లతో కలిసి ఆయన ప్రారంభించారు. కొబ్బరికాయ కొట్టి శిలా ఫలకాన్ని ఆవిష్కరించి మొదటి బ్లాకును రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. లబ్ధిదారులకు కేటాయించిన ఇండ్లను పరిశీలించిన మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి తదితరులకు పలువురు లబ్ధిదారులు నూతన వస్త్రాలను బహూకరించారు. నిరు పేదలమైన తమకు రెండు పడక గదుల ఇండ్లను కేటాయించినందుకు రాష్ట్ర ప్రభుత్వానికి

మిగతా 2వ పేజీలో..





అత్యవసర వినియోగానికి

## ఎరువుల గోదాం ఏర్పాటు

– కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

**వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల :**

జిల్లాలో అత్యవసర సమయంలో వినియోగించేందుకు ఎరువుల గోదాంను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ సందీప్ కుమార్ ఝా వెల్లడించారు. సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని అపెరల్ పార్కులో 100 మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో ఎరువుల గోదాంను ఏర్పాటు చేయగా, శుక్రవారం కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, సిరిసిల్ల మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ స్వరూపారెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగంతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడారు. జిల్లాలో ఎప్పుడైనా.. ఎక్కడైనా అత్యవసర పరిస్థితిలో ఎరువులు కొరత ఏర్పడినప్పుడు అందజేసేందుకు ముందస్తుగా ఎరువుల గోదాం ఏర్పాటు చేసినట్లు వివరించారు. 100 మెట్రిక్ టన్నుల ఎరువులు బఫర్ లో అందుబాటులో పెడతామని తెలిపారు. అనంతరం జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం మాట్లాడారు.జిల్లాకు అవసరమైన ఎరువులు గతంలో కరీంనగర్, పెద్దపల్లి, జగిత్యాల జిల్లాల నుంచి మాత్రమే జిల్లాకు తెప్పిస్తున్నామని తెలిపారు. అత్యవసర సమయంలో ఎరువులు కావాల్సివస్తే ఇబ్బందులు ఎదురయ్యేవని గుర్తు చేశారు. ఈ ఇబ్బందులు అన్ని దూరం చేసేందుకు జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ప్రత్యేక చొరవతో అపెరల్ పార్కులో 100 మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో ఎరువుల గోదాంను ఏర్పాటు చేయించారని వెల్లడించారు. జిల్లాలో ఎరువులకు కొరత లేదని రైతులకు సరిపడా ఎరువులు అందుబాటులో ఉన్నాయని స్పష్టం చేశారు.



## పేకాట స్థావరంపై పోలీసుల మెరుపు దాడి

**వేద న్యూస్,బోయినపల్లి:**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలంలోని జగ్గారావుపల్లి గ్రామ శివారులోని వరద కాలువ పక్కన పేకాట ఆడుతున్న వారిపై పోలీసులు మెరుపు దాడి చేశారు. బోయినపల్లి ఎస్ఐ రాజ్ కుమార్‌కు అందిన విశ్వసనీయ సమాచారం ఆధారంగా సిబ్బందితో కలిసి ఆకస్మికంగా దాడి జరిపారు. ఈ దాడిలో గంగాధర మండలానికి చెందిన ఐదుగురిని అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ.7,200 నగదు, నాలుగు సెల్‌ఫోన్లు, ఒక ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. మరో ముగ్గురు వ్యక్తులు పరారైనట్లు పోలీసులు తెలిపారు.ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు ఎస్ఐ రాజ్ కుమార్ వెల్లడించారు.

## ఆటో డ్రైవర్లకు అవగాహనా సదస్సు


**వేద న్యూస్, చందుర్తి :**



రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి మండల కేంద్రంలో ఆటో మరియు ట్రాలీ డ్రైవర్లకు శుక్రవారం సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సై రమేష్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇందులో ముఖ్యంగా స్కూల్ ఆటోలు, వాటిలో ప్రయాణించే విద్యార్థుల భద్రత, మోటార్ వెహికిల్స్ చట్టం లోని నిబంధనలు, అధిక లోడ్ మరియు అధిక ప్రయాణికులను ఎక్కించడంపై ఉన్న నిషేధం గురించి సవివరంగా వివరించారు. ప్రమాదాలను నివారించడానికి పాటించాల్సిన జాగ్రత్తలు, డ్రైవింగ్‌లో అప్రమత్తత అవసరం, వాహనాల ఫిట్‌నెస్ సర్టిఫికేట్, ఇన్సూరెన్స్, డ్రైవింగ్ లైసెన్స్ వంటి పత్రాలు ఎప్పుడూ సిద్ధంగా ఉంచుకోవాలని డ్రైవర్లకు సూచించారు. అదేవిధంగా స్కూల్ ఆటోలలో విద్యార్థుల సంఖ్యను పరిమితి కంటే ఎక్కువగా ఎక్కించరాదని, ప్రయాణంలో ఎటువంటి అజాగ్రత్త కలిగిన ప్రాణాలకు ముప్పు కలిగించవచ్చని హెచ్చరించారు.ఈ సందర్భంగా సీఐ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, చిన్నారుల ప్రాణ భద్రత విషయంలో ఎటువంటి రాజీ ఉండదు. మీ జాగ్రత్త ఒక కుటుంబాన్ని సంతోషంగా ఉంచుతుంది అన్నారు. ఎస్ఐ రమేష్ మాట్లాడుతూ, ఓవర్‌లోడింగ్, అధిక వేగం వలన జరిగే ప్రమాదాలు క్షణాల్లో ప్రాణాలు తీస్తాయి. కాబట్టి నియమాలు కచ్చితంగా పాటించాలి" అని డ్రైవర్లకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక పోలీసులు, ఆటో యూనియన్ ప్రతినిధులు, ఆటో డ్రైవర్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పోలీసులు డ్రైవర్లకు అవగాహన కల్పించి తప్పక నియమాలను పాటించమని తెలియజేశారు.

## భయం..భయం..!

**వేద న్యూస్ ,వీర్నపల్లి :**



వీర్నపల్లి మండల కేంద్రంలో ప్రధాన రహదారిలో కొన్ని నెల లుగా వీధి దీపాలు వెలగడం లేదు. దాంతో సాయంత్రం పూట ప్రజలు బయటకు వెళ్లాలంటేనే భయపడే పరిస్థితి వచ్చింది.వాన కాలం కావడంతో సాయంత్రం వేళన పాములు, తేళ్లు లాంటి విష పురుగులు బయటికి వస్తున్నాయి. రాత్రి సమయంలో వీధి దీపాలు కూడా వెలగకపోవడంతో ఇండ్ల నుండి బయటకు వెళ్లాలంటే గ్రామ ప్రజలు జంకుతున్నారు. అధికారులకు తమ సమస్యలు చెప్పినప్పటికీ పట్టించుకోవటం లేదని గ్రామస్తులు వాపోయారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి మండలంలో వీధి దీపాలు వేయించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## సీఎంను కలిసిన విప్ జగదీశ్వరి

- నియోజకవర్గ సమస్యలపై చంద్రబాబుకు వినతి
- పలు అభివృద్ధి పనులకు నిధులు రిలీజ్ చేయాలని రిక్వెస్ట్

**వేద న్యూస్, పార్వతీపురం మన్యం జిల్లా ప్రతినిధి:**

ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడును రాష్ట్ర ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి ఉండవల్లిలోని ముఖ్యమంత్రి నివాసంలో శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. కురుపాం నియోజకవర్గంలో ఐదు మండలాలలో రహదారులు కోసం నిధులు మంజూరు చేయాలని, పీఎంజన్మ యోజన పథకం క్రింద టీజీ గ్రామాలకు బోర్స్ మంజూరు చేయాలని, సెగ్మెంట్ పరిధిలో పెండింగ్ లో ఉన్న నాడు - నేడు పనులకు నిధులు మంజూరు చేయాలని కోరారు. భద్రగిరి హాస్పిటల్ లో 100 పడకల కోసం నిధులు ఇవ్వాలని, కుంకి ఏనుగులు కురుపాం నియోజకవర్గానికి త్వరగా పంపించాలని విన్నవించారు. ఏనుగులు వలన నష్ట పోయిన రైతులకు,

మిగతా 4వ పేజీలో..



## బండికి మద్దతుగా తరలిన నేతలు

– బీజేపీ ఎల్కతుర్తి మండల అధ్యక్షుడు శ్రీకాంత్ ఆధ్వర్యంలో..

**వేద న్యూస్, ఎల్కతుర్తి:**



రాష్ట్రంలో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో బాధితుడిగా సిట్ విచారణ సందర్భంగా కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ శుక్రవారం హాజరయ్యారు. ఈ సందర్భంగా బండి సంజయ్ కు మద్దతుగా ఎల్కతుర్తి మండలం నుంచి బీజేపీ మండల అధ్యక్షుడు మంతుర్తి శ్రీకాంత్ యాదవ్ ఆధ్వర్యంలో మండల నాయకులు హైదరాబాద్‌కు తరలివెళ్లారు. కేంద్ర మంత్రికి సపోర్టుగా దిల్ కుష గెస్ట్ హౌస్ నుంచి భారీ ర్యాలీగా తరలి వెళ్లారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ యాదవ్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలోని ప్రజల మనుషుల్లో తనకంటూ ఓ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్న ప్రజానాయకుడు, ధైర్యవంతుడు సమర్థవంతుడు బండి సంజయ్ కుమార్ అని చెప్పారు. ఆయన కరీంనగర్ నుంచి రాజకీయ జీవితాన్ని ప్రారంభించి భారతీయ జనతా పార్టీలో ప్రముఖ నాయకుడిగా ఎదిగారని వెల్లడించారు. సంజయ్ నేతృత్వంలో తెలంగాణలో పార్టీ శక్తిమంతంగా తయారైందని వివరించారు. ప్రజాసంగ్రామ యాత్రం ద్వారా తెలంగాణ వ్యాప్తంగా తిరిగి ప్రజల సమస్యలను తెలుసుకున్నారని పేర్కొన్నారు. సిట్ విచారణలో కాంగ్రెస్ పార్టీపై తమకు నమ్మకం లేదని, విచారణను సీబీఐకి మండల పార్టీ తరఫున డిమాండ్ చేస్తున్నట్టు వెల్లడించారు.

వేద న్యూస్

శనివారం ఆగస్టు 09, 2025

# మాది పేదల సర్కార్

లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు. కాళోజీ కళాక్షేత్రంలో రెండు పడక గదుల ఇండ్ల లబ్ధిదారులకు ఇండ్ల కేటాయింపు ధ్రువపత్రాలను పంపిణీ చేశారు.

**– ఇండ్ల పంపిణీపై నాయిని కలిశారు: పొంగులేటి**

వరంగల్ పశ్చిమ నియోజకవర్గానికి సంబంధించిన ఇందిరమ్మ ఇళ్లు, 2బిహెచ్ కె ఇండ్ల పంపిణీ కార్యక్రమం హనుమకొండలోని కాళోజీ కళా క్షేత్రంలోని ఆడిటోరియంలో నిర్వహించారు. రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, తదితరులు జ్యోతి ప్రజ్వలన చేయగా, మంత్రి శ్రీనివాస్ రెడ్డి కంప్యూటర్ బటన్ ఆన్ చేసి ర్యాండమైజ్‌లో లబ్ధిదారులకు ఇండ్ల కేటాయింపు పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల కోసం గత ప్రభుత్వ హయాంలో ప్రజాధనాన్ని ఖర్చు చేయాల్సినంత ఖర్చు చేసి పేదల కల, ఆశను నెరవేర్చలేదన్నారు. పేదల సొంతింటి కలను నెరవేర్చాలనే సంకల్పంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, తన వద్దకు వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి పలుమార్లు కలిసి ఇండ్ల పంపిణీ గురించి ప్రస్తావించారని వెల్లడించారు.

**– అర్హులైన పేదలకు ఇండ్లు ఇస్తాం: శ్రీనివాస్‌రెడ్డి**

రెండు పడక గదుల ఇండ్ల కేటాయింపు జరిగిందన్నారు. పేదవారి కలను ప్రజా ప్రభుత్వం సాకారం చేసిందని పేర్కొన్నారు. కట్టిన ఆరు సంవత్సరాలైన గత పాలకులు ఇండ్లు ఇవ్వలేదన్నారు. ప్రైమ్ ల్యాండ్ అని, జీవనోపాధికి అన్ని ఆ ప్రాంతంలో ఉన్నాయని వెల్లడించారు. ఇంకా అర్హులైన పేదవారికి స్లమ్ ఏరియాలో ఉంటున్న వారికి కూడా కేటాయిస్తామని, అలాంటి వారి జాబితాను కలెక్టర్ రూపొందిస్తే అదనంగా ఇండ్లను కేటాయిస్తామని పేర్కొన్నారు. పేదల సొంతింటి కలను నెరవేర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని, ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా నాలుగు విడతల్లో అర్హులందరికీ ఇళ్లు అందజేస్తామని పునరుద్ఘాటించారు. రాష్ట్రవ్యాప్తంగా రానున్న మూడేళ్లలో 20 లక్షల ఇందిరమ్మ ఇళ్లను నిర్మించే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు. హన్మకొండలో ప్రారంభించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఈ పథకంలో భాగమేనని, పేదల జీవన ప్రమాణాలను మెరుగుపరచడమే తమ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. అభివృద్ధి, సంక్షేమం తమ సర్కారుకు రెండు కళ్ల లాంటివని పేర్కొన్నారు. ఇందిరమ్మ ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి కృషి చేస్తుందన్నారు.రాష్ట్ర ప్రభుత్వం పేదల పక్షపాత ప్రభుత్వమని అన్నారు. పేదల సంక్షేమం దృష్ట్యా రాష్ట్ర ప్రభుత్వం వివిధ పథకాలను అమలు చేస్తోందన్నారు. ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా సుమారు 17 లక్షల మంది పాత కార్డులలో కొత్తగా రేషన్ కార్డులలో చేర్చామని చెప్పారు.

**– ఇండ్ల పంపిణీ సంతృప్తినిచ్చింది: ఎమ్మెల్యే నాయిని**

వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ పండగ వాతావరణంలో ఇండ్ల పంపిణీ కార్యక్రమం చేసుకోవడం ఎమ్మెల్యేగా తనకెంతో సంతృప్తిగా ఉందన్నారు. దాదాపుగా అరవై లక్షల వ్యయమైన ఇండ్లను నిరుపేదలకు కేటాయించడం జరిగిందన్నారు. నిజమైన లబ్ధిదారులకు ఇండ్లను కేటాయించడం తనకెంతో ఆనందంగా ఉందని చెప్పారు. గుడిసెలు వేసుకున్న అందరికి ఇండ్లను కేటాయించామని, ఇంకా ఎవరైనా ఉన్నట్లయితే వారికి తప్పనిసరిగా న్యూశాయంపేటలో కేటాయిస్తామని వెల్లడించారు. ఇంకా చాలామంది నిరుపేదలున్నారని, శాయంపేట, తదితర ప్రాంతంలో ప్రభుత్వ భూములు గుర్తించి అక్కడ కూడా ఇందిరమ్మ ఇండ్లు నిర్మించేవిధంగా కేటాయించాలని మంత్రి శ్రీనివాస్ రెడ్డి ని కోరారు. ఇండ్లలో తాగునీరు, విద్యుత్, తదితర సౌకర్యాలను కల్పిస్తామని హామీనిచ్చారు. వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి మాట్లాడుతూ..వరంగల్ నగరాభివృద్ధికి ఇది ఒక మైలురాయని అన్నారు. నిరుపేదలకు సొంతిల్లు ఒక కల, ఆ కలను రాష్ట్ర ప్రభుత్వం నెరవేర్చిందని వెల్లడించారు. ఎమ్మెల్సీ బస్వరాజ్ సారయ్య మాట్లాడుతూ గత 10 సంవత్సరాలలో జరగని అభివృద్ధి ని 18 నెలల్లో చేసి చూపించారని స్పష్టం చేశారు.

**– లబ్ధిదారులకు ప్రజాప్రతినిధుల అభినందనలు : ఎమ్మెల్యే కెఆర్. నాగరాజు**

వర్ధన్నపేట ఎమ్మెల్యే కెఆర్. నాగరాజు మాట్లాడుతూ..వరంగల్ నగరాన్ని అభివృద్ధి కి ఎమ్మెల్యేలుగా కలిసికట్టుగా కృషి చేస్తున్నట్లు తెలిపారు. వరంగల్ అభివృద్ధి కి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సహకారంతో వివిధ అభివృద్ధి పనులను చేపడుతున్నట్లు తెలిపారు. ఇటీవల ఢిల్లీకి వెళ్లినప్పుడు కూడా వరంగల్ ఎయిర్‌పోర్ట్, తదితర అభివృద్ధి కి కావాల్సిన నిధులు కు కేంద్ర మంత్రులను కలిసినట్లు పేర్కొన్నారు. ప్రజా ప్రభుత్వం రాష్ట్ర ప్రజల అభివృద్ధికి, సంక్షేమానికి కృషి చేస్తుందన్నారు. వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ప్రత్యేక చొరవ తో ఇండ్ల పంపిణీ కార్యక్రమం పారదర్శకంగా చేపట్టడం జరిగిందన్నారు. పేదలు ఎన్నో ఏండ్లుగా ఆశతో ఎదురుచూస్తున్న కల నెరవేరిందన్నారు. పేదల అభివృద్ధి, సంక్షేమానికి ప్రజా ప్రభుత్వం కృషి చేస్తుంటే కొందరు కావాలనే నిందలు వేస్తున్నారని అన్నారు. రేషన్ కార్డుదారులకు సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామని పేదల కళ్లల్లో ఆనందం చూస్తున్నామని పేర్కొన్నారు. ఇండ్లు పొందిన లబ్ధిదారులకు అభినందనలు తెలిపారు. కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ అత్యంత పారదర్శకంగా కేటాయింపు జరిగిందన్నారు. గుడిసెలు వేసుకున్న వారందరికీ ఇండ్లను కేటాయించినట్లు పేర్కొన్నారు. 592 చదరపు అడుగుల విస్తీర్ణంలో 592 ఇండ్లను నిర్మించినట్లు తెలిపారు. అత్యంత విలువైన స్థలంలో ఇండ్లను నిర్మించారని పేర్కొన్నారు.కార్యక్రమంలో కుడా చైర్మన్ ఇనగాల వెంకటరామిరెడ్డి, జీడబ్ల్యుఎంసీ కమిషనర్ చాహత్ బాజ్ పాయ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అజీజ్ ఖాన్, ఇతర సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

### ఆనంద్ విద్యానికేతన్ హై స్కూల్‌లో

## రక్షాబంధన్ వేడుకలు



### – అన్నదమ్ముల అనుబంధానికి ప్రతీక రక్షాబంధన్

**వేద న్యూస్,బోయినిపల్లి:**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం లోని ఆనంద్ విద్యానికేతన్ హై స్కూల్‌లో శుక్రవారం రోజు రక్షాబంధన్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. అన్నదమ్ముల బంధాన్ని ప్రతిబింబించే విధంగా విద్యార్థులు ఒకరికి ఒకరు రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ సందర్భంగా స్కూల్ కరస్పాండెంట్ బిల్లా ఆనందం మాట్లాడుతూ విద్యార్థుల్లో సంప్రదాయాల పట్ల గౌరవం, మానవీయ విలువలు పెంపొందించేందుకు ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయని అన్నారు ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ చంద్రమౌళి, ఉపాధ్యాయని ఉపాధ్యాయులు విజయ, గమనశ్రీ, రూప, మమత,లక్షిత,అర్చన, జమున, శ్యామల, మమత, దివ్య, సునీత, రాంప్రసాద్, కృష్ణహరి,సంధ్య, వనజ, విద్యార్థిని,విద్యార్థులు, పాల్గొన్నారు.

### అరవింద పబ్లిక్ స్కూల్‌లో

## ఘనంగా రక్షాబంధన్ వేడుకలు

**వేద న్యూస్, వరంగల్ టౌన్:**



రాఖీ పండుగను పురస్కరించుకొని వరంగల్ నగరంలోని రంగశాయిపేటలో గల అరవింద పబ్లిక్ స్కూల్ లో ప్రిన్సి పాల్ పంచకం రమాదేవి ఆధ్వర్యంలో శుక్రవారం ముందస్తు రక్షాబ ంధన్ వేడుకలు ఘనంగా జరిగా యి. పాఠశాలలో విద్యార్థి నీలు విద్యార్థులకు రాఖీలు కట్టి సోదరీ భావాన్ని చాటుకున్నారు. అనంతరం మిఠాయిలు తినిపించుకొని ఒకరికొకరు రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ముఖ్యఅతిథిగా హాజరైన కరస్పాండెంట్ పంచకం నర్సయ్య మాట్లాడుతూ హిందువులు జరుపుకునే పండుగలలో ముఖ్యమైనది రాఖీ పండుగ అని అన్నారు. అన్నా చెల్లెళ్లు, అక్క తమ్ముళ్ల మధ్య ప్రేమకు సూచికగా ఈ పండుగను జరుపుకుం టారు. రాఖీ అనగా రక్షణ బంధం అని అర్థం. సోదరీమణులు తమ సోదరులు ప్రతిపనిలో విజయం సాధించాలని కోరుకొని రాఖీ కడుతారు. అనంతరం మిఠాయిలు తినిపించి హారతి ఇచ్చి తమ క్షేమా న్ని కోరుకుంటారు. సోదరులు తమ సోదరికి జీవితాంతం రక్షణగా ఉంటామని వాగ్దానం చేస్తారని తెలిపారు. విద్యార్థులు పాఠశాలలో సోదర భావముతో ఒకరికొకరు రక్షణగా ఉంటూ మంచి వాతావరణంలో విద్యను అభ్యసించాలని కోరారు. ఈ సందర్భంగా విద్యార్థులకు రాఖీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## క్విట్ ఇండియా నిరసనలను జయప్రదం చేయండి

**వేద న్యూస్, వరంగల్ ప్రతినిధి:**

భారతదేశం రష్యా నుండి చమురు దిగుమతి చేసుకుంటున్నందుకు ప్రతీకారంగా అమెరికా ప్రభుత్వం భారతదేశం నుండి జరుగు దిగుమతులపై 50శాతం సుంకాలను విధించడాన్ని, వ్యతిరేకించాలని ఎస్ కేయం జిల్లా నాయకులు రాచర్ల బాలరాజు సోమిడి శ్రీనివాస్ లు అన్నారు. నాటి బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా జరిగిన 83వ క్విట్ ఇండియా వార్షికోత్సవ సందర్భంగా ఈ నెల 13వ తేదీన వరంగల్ చౌరస్తాలో సంయుక్త కిసాన్ మోర్చా ఎస్ కే యం ఆధ్వర్యంలో జరుగు నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. అబ్బని కుంట ఏరియాలోని తెలంగాణ రైతు సంఘం భవన్లో జిల్లా రైతు సంఘాల సమావేశం నాయకులు ఓదెల రాజయ్య అధ్యక్షతన జరిగింది. ప్రపంచంలో ఏ దేశంతో నైనా అతి తక్కువ ధరకు చమురు కొనుగోలు చేసే హక్కు భారత్ కు ఉంటుందని దీనిని అమెరికా ప్రభుత్వం గుర్తించాలని వారు అన్నారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం అమెరికా ప్రభుత్వంతో ద్వైపాక్షిక చర్చలు జరిపి ట్రంప్ ప్రభుత్వానికి లొంగిపోయే ప్రమాద సూచికలు కనపడుతున్నాయని వారు ఆందోళన వ్యక్తం చేశారు. దేశ సార్వభౌమత్వాన్ని తాకట్టు పెట్టే విధానాలను వదులు కోవాలని వారు డిమాండ్ చేశారు. నేడు ప్రపంచంలో జరు గుతున్న ప్రచ్ఛన్న యుద్ధ వాతావరణము ఏర్పడడానికి అమెరికాయే కారణమ న్నారు. సామ్రాజ్యవాద అమెరికా ప్రభుత్వం చేసే ఆర్థిక దిగ్బంధనాన్ని వ్యతిరేకిస్తూ జరిగే నిరసన కార్యక్ర మాన్ని జయప్రదం



చేయాలని ప్రజలను వారు కోరారు. ఈ సమావేశంలో రైతు సంఘాల నాయకులు వల్లందాస్ కుమార్, ఐత నగేష్ , జక్కుల తిరుపతి, ఇనుముల కృష్ణ, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఐరీష్ స్కూల్ లో ఘనంగా బోనాల వేడుకలు


**వేద న్యూస్, సూర్యాపేట :**



సూర్యాపేట జిల్లా కేంద్రంలోని విద్యానగర్ గల ఐరీష్ ఒలంపియాడ్ స్కూల్లో శుక్రవారం బోనాల పండుగ సంబరాలను విద్యార్థులు, ఉపాధ్యాయులు, తెలంగాణ సంస్కృతి సాంప్రదాయలు ప్రతిబింబించే విధంగా ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా బాలురు పోతురాజుల వేషాలతో సందడి చేయగా, బాలికలు బోనాలు ఎత్తుకుని ఊరేగించారు. శ్రావణ మాసంలో జరుపుకునే ముఖ్యమైన పండుగ బోనాల పండుగ అని అన్నారు. విద్యార్థులకు అనాదిగా వస్తున్న మన సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన కల్పించేందుకు ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.విద్యార్థులు ఇళ్లలో తయారు చేసిన నైవేద్యాన్ని తలపై పెట్టుకుని ఊరేగింపు నిర్వహించారు.విద్యార్థుల సంప్రదాయ వస్త్రధారణ,డప్పు చప్పుళ్లు, పోతరాజు వేషధారణ ఆకట్టుకున్నాయి.ఈ కార్యక్రమంలో ఐరీష్ ఒలంపియాడ్ స్కూల్ కరస్పాండెంట్ మన్నె మురళీధర్, ప్రిన్సిపాల్ నంద్యాల సృజనా రెడ్డి, జి, భవానీ, పలుసు జ్యోతి, జె, రాధిక, ఎండీ అస్మా, మౌనిక, ఉదయశ్రీ, వర్షిని, అటెండర్ సట్టు శ్రీను,విద్యార్థులు, విద్యార్థినులు, తదితరులు పాల్గొన్నారు.

## నల్లబెల్లిలో ఘనంగా వరలక్ష్మి వ్రత మహోత్సవాలు

**వేద న్యూస్, నల్లబెల్లి :**



శ్రావణ మాసంలోని ముఖ్యమైన పర్వదినమైన వరలక్ష్మి వ్రతాన్ని నల్లబెల్లి మండలంలో ఉన్న ప్రతి గ్రామంలో మహిళలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. శుక్రవారం ఉదయం నుంచే వ్రతాల కోసం మహిళలు విశేషంగా సన్నద్ధమయ్యారు. ఇంటి పరిసరాలను శుభ్రంగా చేసుకుని ముగ్గులతో అలంకరించారు. అనంతరం వరలక్ష్మి అమ్మవారిని శోభాయమానంగా అలంకరించి, పూజా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఈ వ్రతాన్ని ఆచరించిన తరువాత, మహిళలు సమీప దేవాలయాలకు వెళ్లి స్వామివారి దర్శనం చేసుకున్నారు. వ్రతం ముగిసిన తరువాత ఒకరికొకరు వాయనం, పసుపు, కుంకుమ, బొట్టు ఇచ్చుకుంటూ శుభాకాంక్షలు తెలియజేశారు. గ్రామాల్లో ప్రతి వీధిలో సాంప్రదాయ స్త్రీల సాంఘికత కనిపించగా, ఆడపడుచుల భక్తి సందడి గ్రామాల నలుమూలలకూ విస్తరించింది. ఈ సందర్భంగా కొన్ని గ్రామాలలో సామూహికంగా వరలక్ష్మి వ్రతాలు నిర్వహించబడినాయి. వ్రతాల అనంతరం ప్రసాదాలు పంచుతూ, సాంప్రదాయాల పరిరక్షణకు స్త్రీల పాత్ర మరింతగా ప్రతిఫలించిందని పెద్దలు అభినందించారు. అలయాలన్నీ ప్రత్యేకంగా అలంకరించబడి, భక్తులతో కిటకిటలాడాయి. ఉత్సవ వాతావరణం గ్రామాల నలుమూలలకూ ప్రబలగా కనిపించింది. సంప్రదాయాలకు విలువనిచ్చే ఈ విధమైన కార్యక్రమాలు సమాజాన్ని ఐక్యంగా నిలబెట్టే శక్తిగా నిలుస్తాయని స్థానిక పెద్దలు అభిప్రాయపడ్డారు.

## అంబరాన్నంటిన ముత్యాలమ్మ బోనాల పండగ

**వేద న్యూస్, నల్లగొండ ప్రత్యేక ప్రతినిధి:**

వేములపల్లి మండల కేంద్రంలోని ఆమనగల్లు గ్రామములో గురువారం ముత్యాలమ్మ బోనాల పండుగ అంబరాన్నంటాయి. తెల్లవారుజామున నుంచి మహిళలు పసుపు, కుంకుమతో బోనాలను అలంకరించి డిజె సౌండ్ తో దేవాలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు ముత్యాలమ్మ తల్లి దీవెనలు ప్రతి ఒక్కరికీ కలగాలని, పాడి పంటలతో సమృద్ధిగా వర్ధిల్లాలని మొక్కులు చెల్లించుకున్నారు. అదేవిధంగా యువకులు డిజె సౌండ్లతో కోడిపుంజులు పట్టుకొని డ్యాన్సులతో సందడి చేశారు. దేవాలయం వద్ద బైండ్ల వేదస్తులు ప్రత్యేక పూజలు నిర్వహించడంతో మహిళలు పూనకాలతో దర్శనమిచ్చారు. దీంతో మహిళల పూనకాలు పలువురుని ఆకట్టుకున్నాయి. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా స్థానిక ఎస్సై డి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో పోలీస్ పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించి మాట్లాడారు. ముత్యాలమ్మ తల్లి ఆశీస్సులు గ్రామ ప్రజలందరికీ కలగాలని ఆకాంక్షించారు. ఎంతో నిష్టతో గ్రామ మహిళలు బోనాలు ప్రత్యేకంగా పసుపు, కుంకుమలతో అలంకరించి ముత్యాలమ్మ తల్లికి సమర్పించడం ఆనందంగా ఉందన్నారు. ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మికతను అలవర్చుకోవాలని కోరారు.



## ఖమ్మంలో ఘనంగా మహేష్ బాబు పుట్టినరోజు వేడుకలు

**వేద న్యూస్, ఖమ్మం :**

సూపర్ స్టార్ కృష్ణ మహేష్ సేన నగర కమిటీ ఆధ్వర్యంలో ఖమ్మంలో మహేష్ బాబు 50వ పుట్టినరోజు సందర్భంగా తలసేమియా వ్యాధిగ్రస్తులకు రక్తదాన శిబిరం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ ఏసీపీ గణేష్ , కూరపాటి ప్రదీప్ విచ్చేసారు జిల్లా గౌరవ అధ్యక్షులు తోట రంగారావు మాట్లాడుతూ రక్త దానం చేసిన అభిమానులకు ధన్యవాదములు తెలిపారు జిల్లా అధ్యక్షులు దేవభక్తిని కిషోర్ బాబు మాట్లాడుతూ మహేష్ బాబు మాకు అప్ప చెప్పిన బాధ్యతలు ప్రతి సంవత్సరం ఎంతో ఘనంగా నగర కమిటీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామన్నారు. నగర అధ్యక్షులు మునగాల బాలు మాట్లాడుతూ మహేష్ బాబు జన్మదినం సందర్భంగా తోట దమయంతి ఆధ్వర్యంలో ఉదయం 10 గంటలకు చీరాల పంపిణీ మధ్యాహ్నం 12గంటలకు గవర్నమెంట్ హాస్పిటల్ లో అన్నదానం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమం లో నగర కన్వీనర్ పులిపాటి సంపత్ కుమార్ ఉపాధ్యక్షులు బుర్రి మోహనరావు,జిల్లా ఉపాధ్యక్షులు గురుమూర్తి, వెంకన్న, సహాయ కార్యదర్శి గౌతమ్, నంద్యాల నర్సింహారావు, సుధాకర్, యాసం శివ, రఘునాథపాలెం మండల అధ్యక్షులు దుంపటి శ్రావణ్ కుమార్, బానోత్ సిద్ధూ,షేక్ అస్లాం, మంత్రమూర్తి శ్రీ హర్ష,బానోత్ రఘు పాల్గొన్నారు.

# వచ్చే ఎన్నికలలో ముదిరాజులకు సముచిత స్థానం కల్పించాలి.!



**వేద న్యూస్, శంకరపట్నం :**

బీసీ జనాభాలో అత్యధిక శాతం ఉన్న ముదిరాజులకు చట్టసభలో వారి గొంతుక వినిపించడానికి ప్రాతినిధ్యం లేకపోవడం బాధాకరమని, ప్రోగ్రెసివ్ స్టూడెంట్ ఫెడరేషన్ నాయకులు అభిలాష్ గౌడ్,జయసూర్య లు అన్నారు. శుక్రవారం రోజున మండల కేంద్రంలో పండగ సాయన్న జయంతి సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. తెలంగాణ రాబిన్ హుడ్ గా ప్రఖ్యాతి చెందిన ముదిరాజ్ బిడ్డ పండుగ సాయన్న జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని కోరారు. అదేవిధంగా బీసీ జనాభాలో అత్యధికం శాతం ఉన్న ముదిరాజులకు వచ్చే ఎన్నికలలో వారికి సముచిత స్థానం కల్పించాలని కోరుతూ, ప్రజా సమస్యల పరిష్కారంపై పిఎస్ఎఫ్ నిరంతరం ప్రజాల పక్షాన పోరాడుతుందని తెలిపారు.

# హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి



**వేద న్యూస్,శాయంపేట:**

భారతీయ జనతా పార్టీ చేపడుతున్న హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని విజయవంతం చేయడం లక్ష్యంగా శాయంపేట మండల కేంద్రంలో సన్నాహక సమావేశం బిజెపి మండల అధ్యక్షుడు నరహరిశెట్టి రామకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమనికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చదువు రామచంద్రా రెడ్డి హాజరువై వారు మాట్లాడుతూ ప్రతి ఇంటిపై త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసే ఉద్దేశంతో ప్రజల్లో జాతీయ పతాకం పట్ల గౌరవం కల్పించి, దేశభక్తిని బలోపేతం చేయాలని సంకల్పంతో రాష్ట్రపార్టీ ఆదేశాల మేరకు హర్ ఘర్ తిరంగా కార్యక్రమన్ని ఈ నెల 10నుండి 12 తేదీల మధ్య మండలంలో తిరంగా యాత్ర నిర్వహిస్తామని ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు ఇప్పటికే ప్రారంభమయ్యాయని వారు తెలిపారు. మండలంలోని ప్రతి గ్రామం నుంచి ఈ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు బీజేపీ కార్యకర్తలు సమిష్టిగా కృషి చేయలని. పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు, ప్రజా ప్రాంగణాల్లో త్రివర్ణ పతాకాలను ఎగురవేస్తూ దేశభక్తిని చాటాల్సిన అవసరాన్ని ఈ సందర్భంగా ఉందని అదేవిధంగా ఈ యొక్క కార్యక్రమంలో ప్రతి పౌరుడు విధిగా పాల్గొనాలని ప్రతి ఇంటికి వెళ్లి త్రివర్ణ పతాకాలను పంపిణీ చేయడం ద్వారా ప్రజల మధ్య దేశభక్తిని పెంపొందించాలనే సంకల్పంతో పార్టీ శ్రేణులు ముందుకెళ్లాలని ఈ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ తమ బాధ్యతగా తీసుకొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం ముగింపులో హర్ ఘర్ తిరంగా ఉద్యమాన్ని శాయంపేట మండలంలో ఘనంగా నిర్వహిస్తామని వారు తెలిపారు .ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ రాయరాకుల మొగిలి, జిల్లా కౌన్సిల్ మెంబర్ కానుగుల నాగరాజు, ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు ఉప్పు రాజు, సీనియర్ నాయకులు వనం దేవరాజ్, మండల కార్యదర్శి మేకల సుమన్, భూత్ అధ్యక్షులు కడారి చంద్రమౌళి, పైడిమల్ల సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# మెట్టుగుట్టపై వరలక్ష్మి వ్రతం ప్రత్యేక పూజలు


**వేద న్యూస్, మడికొండ :**



ఓరుగల్లు మహా నగరంలో అతి ప్రాచీనమై, దక్షిణ కాశీగా పిలవబడుతున్న శ్రీ మెట్టు రామలింగేశ్వర స్వామి, శ్రీ సీతారామ చంద్ర స్వామి దేవస్థానములలో శ్రావణ మాసోత్సవాలలో భాగంగా శ్రావణ శుక్ర వారం సందర్భంగా రామాలయంలో మహాలక్ష్మి అమ్మవారికి పంచామృతాలతో అభిషేకం నిర్వహించి అనంతరం వరలక్ష్మి వ్రతం, కుంకుమార్చన ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా 64 డివిజన్ కార్పొరేటర్ ఆవాల రాధికా రెడ్డి, తదితర భక్తులు ఈ కుంకుమార్చన కార్యక్రమంలో పాల్గొన్నారు. తదుపరి శివాలయంలో అమ్మవారికి చతుషష్టి పూజలు నిర్వహించగా భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి అమ్మవారిని దర్శించి, స్వామి వారికి అభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో శివాలయం కార్యనిర్వహణాధికారి సునీత, రామాలయం కార్యనిర్వహణాధికారి సత్యనారాయణ అర్చకులు రాగిచేడు అభిలాష శర్మ, పరాశరం విష్ణువర్ధనాచార్యులు, పారుపల్లి సత్యనారాయణ శర్మ, అధిక సంఖ్యలో భక్తులు, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మడికొండ పోచమ్మ తల్లికి తొలి బోనం.. భారీగా తరలివచ్చిన మహిళలు

**వేద న్యూస్, మడికొండ :**



మడికొండ శ్రావణ మాసం కావడంతో మడికొండ నగరంలో బోనాల సందడి మొదలైంది. గౌరవ అధ్యక్షులు, మాజీ కార్పొరేటర్ తొట్ల రాజు యాదవ్, ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా బోనాలు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాజీ కార్పోరేటర్ తొట్ల రాజు యాదవ్ మాట్లాడుతూ వర్షాలు బాగా కురిపించి, ప్రజలు సుఖసంతోషాలతో ఉండేలా చూడాలని పోచమ్మ తల్లికి మొక్కుకున్నారన్నారు. పాత పోలీస్ స్టేషన్ దగ్గర ఉన్న పోచమ్మ తల్లి దేవాలయంలో కుమ్మరి వంశస్థుల చేత మొదటి బోనం సమర్పించారు. కుమ్మరి సంఘం పెద్దలతో కలిసి పోచమ్మ తల్లి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అమ్మవారికి నైవేద్యంగా సమర్పించే బియ్యం, పాలు, బెల్లం, ఇతర పదార్థాలు కలిపి నైవేద్యంగా సమర్పించారు. పోచమ్మ ఆలయంలో మహిళలు శుక్రవారం ఘనంగా బోనాలు సమర్పించారు. అమ్మవారికి కల్లుపోసి, సారెపెట్టి పోచమ్మ వీధి భక్తులతో సందడిగా మారింది. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు, మాజీ గ్రామ పంచాయతీ వార్డ్ మెంబెర్ కొలిపాక వెంకటస్వామి (ఉప్పారోళ్ల స్వామి), నర్మేటి బిక్షపతి గాండ్ల, బొల్లికొండ వినోద్ కుమార్ మహిళలు కుమ్మరి సంఘం పెద్దలు, మడికొండ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపిన మాజీ ఎంపీ నామ

**వేద న్యూస్, ఖమ్మం :**



రాఖీ పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని బిఆర్ఎస్ మాజీ లోక్‌సభ పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు రాష్ట్రంలోని ప్రతి ఒక్క అక్కా, చెల్లెలికి హృదయపూర్వక రాఖీ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ రాఖీ పండుగ అనేది అన్నా-చెల్లెళ్ల అనుబంధానికి ప్రతీక అని, కుటుంబ విలువలను గుర్తుచేసే పండుగ అని పేర్కొన్నారు. ఇవాళ ఉన్న సామాజిక పరిస్థితుల్లో పురుషులంతా మహిళల పట్ల మరింత గౌరవ భావనతో మెలగాలని సూచించారు. మహిళలను అన్ని రంగాల్లో ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని, వారికి సమాన అవకాశాలు కల్పించాలన్నారు. మహిళలకు రాజకీయ, వ్యాపార వాణిజ్య అవకాశాల్లో స్థానం కల్పించేందుకు తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు (కేసీఆర్) తన పరిపాలనలో మహిళలకు అత్యంత ప్రాధాన్యతను ఇచ్చి రాష్ట్ర స్థాయిలో మహిళల సంక్షేమం కోసం అనేక విప్లవాత్మక కార్యక్రమాలను ప్రారంభించా రన్నారు. మహిళల ఆరోగ్య, ఆర్థిక, సామాజిక భద్రత కోసం అనేక పథకాలను అమలు చేశారని, కళ్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్ వంటి పథకాలతో పేద కుటుంబాల యువతుల పెళ్లిళ్లకు ఆర్థిక సహాయం అందించారన్నారు. మిషన్ భగీరథ ద్వారా ప్రతి ఇంటికి తాగునీరు అందించి మహిళల కష్టాన్ని తగ్గించారని, అమ్మఒడి, కేసిఆర్ కిట్, ఆరోగ్యలక్ష్మి వంటి పథకాలతో గర్భిణీ స్త్రీల ఆరోగ్యాన్ని కాపాడారన్నారు. బతుకమ్మ పండుగను అధికారికంగా నిర్వహించి మహిళల సాంస్కృతిక విలువలను ప్రోత్సహించటంతో పాటు, మహిళల రక్షణకు షీ టీమ్స్, మహిళా భద్రత విభాగాలను ఏర్పాటు చేశారన్నారు. ఇదే సమయంలో, ఆసరా పెన్షన్ పథకం ద్వారా వితంతువులు, వృద్ధులు, దివ్యాంగులు, బీడి కార్మికులుగా పని చేసే మహిళలకు నెల నెలా పెన్షన్‌లు అందించారని పేర్కొన్నారు. ఇలా కేసీఆర్ నేతృత్వంలో నాడు అమలైన ఈ కార్యక్రమాలు దేశానికి ఆదర్శంగా నిలిచాయిని ఈ సందర్భంగా గుర్తు చేసారు.

# వైద్య విద్య నిమిత్తం శరీర దానం

**వేద న్యూస్, వరంగల్ :**




వరంగల్, గిర్మాజీపేట నివాసి కొమ్మినేని ప్రభంజన్రావు 67సం, అడ్వకేట్ శుక్రవారం మరణించగా, కుటుంబ సభ్యులు సోదరి జినుకుల కవిత సహకారంతో సమాజ హితం కోరి వైద్య విద్యా నిమిత్తం మెడికల్ కాలేజీకి పార్థివ దేహదానం చేశారన్నారు. తెలంగాణ నేత్ర అవయవ, శరీర దాతల అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రత్యేక అంబులెన్స్ లో దేహాన్ని కేఎంసీ అనాటమీ విభాగానికి అప్పగించడమైనాదన్నారు. ప్రిన్సిపల్ సంధ్య ఆదేశంతో అనాటమీ పీజీ డాక్టర్స్ మహేష్ కుమార, జోష్ణ, రూబీ ఖాన్, సిబ్బంది ప్రేమ్ కుమార్, యాదగిరి, ప్రణయ్ దేహాన్ని అనాటమికి తరలించారన్నారు. దేహదాత ప్రభంజన్ రావు కి జోహార్లు అర్పించి, బంధుమిత్రులను ఉద్దేశించి అసోసియేషన్ అధ్యక్షులు మల్లారెడ్డి మాట్లాడుతూ మరణానంతరం పార్థివ దేహ దానం చేసి వందమంది వైద్య విద్యార్థులకు పాఠ్య బోధన గా, సర్జరీ నేర్చుకోవడానికి, వైద్య విద్య అధ్యయన నిమిత్తం తోడ్పడుదామని తెలిపారు. ఈ సందర్భంగా వారి కుటుంబ సభ్యులకు ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. మరిన్ని వివరాలకు 8790548706, 9490133650 గల నెంబర్లకు సంప్రదించవలసిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో బంధుమిత్రులు, ప్రముఖ డాక్టర్ జినుకుల నారాయణ రావు కేఎంసి మొదటి బ్యాచ్ డాక్టర్, వరంగల్ బార్ అసోసియేషన్ అడ్వకేట్ వలస సుధీర్, బార్ అసోసియేషన్ మెంబర్ అడ్వకేట్ జనార్దన్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఉపేందర్ రెడ్డి, వరంగల్ జిల్లా అధ్యక్షులు కోన్ రెడ్డి మల్లారెడ్డి, కందుల గోవర్ధన్, మునిగాల పద్మ, వేణు, జనార్దన్ రెడ్డి, రాజేంద్రప్రసాద్, మోహినూద్దీన్ పాల్గొన్నారు.

# నానో యూరియా వాడకం పై రైతులకు అవగాహన

**వేద న్యూస్,బోయినిపల్లి:**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం లోని ప్రాథమిక సహకార సంఘం, కోరేం, బోయినిపల్లి మండల కేంద్రం లోని ఎరువుల దుకాణాల్లో రైతులను కలిసి నానో యూరియా ఉపయోగాలు వివరించడం జరిగింది. 500 మి. లీ. నానో యూరియా ఒక బస్తా యూరియా తో సమానం. ఇందులో 20 శాతం నత్రజని ఉంటుంది. నేల, గాలి, నీటి కాలుష్యము తగ్గించి, కీటకాల తెగుళ్ల ఉధృతిని తగ్గిస్తుంది. వరి, మొక్కజొన్న, ప్రత్తి పంటలలో 2వ ,3 వ దఫలల్లో పై పాటుగా వేసే యూరియా ని ఈ నానో యూరియా పూర్తిగా భర్తీ చేయగలదు. ఈ నానో యూరియాని పురుగుమందులతో కలిపి డ్రోన్ల ద్వారా పిచికారీ చేస్తే రైతుకు ఖర్చు తగ్గి, మరింత సమర్థవ%శీ%తంగా పని చేస్తాయని మండల వ్యవసాయ అధికారిణి కె ప్రణీత, తెలిపారు. అలాగే వర్షాలు కురుస్తున్నప్పుడు ఎరువులు వేయడం కానీ, పిచికారీ చేయడం కానీ చేయకూడదు అని రైతులకు సూచించారు.



# ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు అందజేత

**వేద న్యూస్, మఠంపల్లి :**

ముఖ్యమంత్రి సహాయనిధి పథకం పేదలకు వరం అని కాంగ్రెస్ పార్టీ యువనాయకుడు మాఖం నరసింహారావు అన్నారు. శుక్రవారం ఆయన మఠంపల్లి మండలం రఘునాథపాలెం గ్రామానికి చెందిన పలువురికి సి ఎం ఆర్ ఎఫ్ చెక్కులను మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి క్యాంపు కార్యాలయంలో పలువురికి అందజేశారు. ఈకార్యక్రమంలో నాయుడు ఆంజనేయులు, ఆవుల దొడ్డి వెంకటేశ్వర్లు, కొండేటి మహమ్మద్ పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ముందస్తు రాఖీ వేడుకలు



**వేద న్యూస్, చొప్పదండి :**

అన్నా చెల్లెళ్ళ, అక్కా తమ్ముళ్ళ అపురూప బంధానికి ప్రతీకగా జరుపుకునే రాఖీ పండుగ సందర్భంగా చొప్పదండి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నందు మహిళా కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి గుంటి స్వరూప ఆధ్వర్యంలో ఘనంగా రాఖి వేడుకలు నిర్వహించారు. ఇట్టి కార్యక్రమం లో మహిళా కాంగ్రెస్ మండల అధ్యక్షురాలు చిలుముల స్వప్న, అర్నకొండ గ్రామ మహిళా అధ్యక్షురాలు గర్శకుర్తి సునీత, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు నిజనపురం చందు, మార్కెట్ వైస్ చైర్మన్ మునీగాల రాజేందర్, జిల్లా ప్రధాన కార్యదర్శి పెరుమండ్ల గంగయ్య గౌడ్, నాయకులు మాజీ ఎంపీపీ మునీగాల చందు గౌడ్, నేరుమట్ల మల్లేశం, కళ్లెం రవీందర్ రెడ్డి, పెరుమండ్ల రవీందర్, జాతరకొండ ఒద్దయ్య, జక్కుల అనిల్ కుమార్, జక్కుల జనార్ధన్, పెరుక శ్రీనివాస్, బండారి రాజేష్, ఎండీ రజాక్, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రజా ప్రభుత్వంతోనే సాధ్యమైన కొత్త రేషన్ కార్డుల పంపిణీ



**వేద న్యూస్, బోయినిపల్లి:**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం లో తెలంగాణ రాష్ట్ర ప్రజా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రేషన్ కార్డులను బోయినిపల్లి మండల కేంద్రంలో చొప్పదండి శాసనసభ్యులు డాక్టర్ మేడిపల్లి సత్యం, ఆదేశాల మేరకు రేషన్ కార్డు లబ్ధిదారుల ఇంటింటికి వెళ్లి రేషన్ కార్డులు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బోయిని ఎల్లేష్ యాదవ్, సంబ లక్ష్మిరాజం, పిట్టల రమేష్, నల్లమోహన్, ధ్యావ మహిపాల్ రెడ్డి, మ్యాన కరుణాకర్, పొత్తూరి మహేందర్, మొగులోజి శ్రీకాంత్, బోయిని పరశురాం, గుంటి జలంధర్, బోయిని మల్లేశం, మాడిశెట్టి పురుషోత్తం, నల్లగొండ శ్రీనివాస్,పాల్గొన్నారు.

# నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం

**వేద న్యూస్, చొప్పదండి :**

చొప్పదండి గ్రేన్ మార్కెట్ మర్చంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ 2025-2027 సంవత్సరాలకు గాను నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం గురువారం రాత్రి చొప్పదండి వ్యవసాయ మార్కెట్ లో నిర్వహించడం జరిగింది. ఎన్నికల అధికారి సూర ఆనందం నూతన కార్యవర్గం చే ప్రమాణ స్వీకారం చేయించారు. అధ్యక్షులు కొల్లూరి ఆనందం, ఉపాధ్యక్షులు మాడూరి శ్రీనివాస్, యాంసాని సాంబమూర్తి, కార్యదర్శి కటకం మల్లికార్జున్ (మహేష్) కోశాధికారి నలుమాచు విజయ్ కుమార్, సహాయ కార్యదర్శి సూర రమేష్ లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనంతరం కార్యవర్గం ను సభ్యులు అభినందించారు. ఈ కార్యక్రమంలో నలుమాచు కాశీనాథం, తొడుపునూరి లక్ష్మయ్య, పెద్ది లక్ష్మికాంతం, తొడుపునూరి సత్యనారాయణ, నలుమాచు సుధాకర్, కాసం శ్రీనివాస్, ఆవునూరి సత్యనారాయణ, బొల్లం లక్ష్మి కాంతం, తొడుపునూరి వినాయక రాజు, పెద్ది మురళీ కృష్ణ, కొల్లూరి జితేందర్, పెద్ది గోపికృష్ణ , కటకం సాయి రాం, రాపాల మహేందర్, శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

వేద న్యూస్
శనివారం ఆగస్టు 09, 2025

# సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే

**వేద న్యూస్, ఇల్లంతకుంట :**



రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండల పరిషత్ కార్యాలయంలో మండలానికి చెందిన 125 మందికి 33,52,000 రూపాయలు విలువ చేసే చెక్కులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ బీఆర్ఎస్ పాలనలో సీఎం రిలీఫ్ ఫండ్ కింద ఆర్థిక సహాయం పొందడం గగనంగా మారిందని, దీంతో ప్రజలు సాయం కోసం ఎదురుచూస్తూ విసిగివేసారి పోయారన్నారు. ఇలాంటి పరిస్థితులు ఎదురు కాకుండా ఉండేందుకు ప్రభుత్వం ఆన్లైన్ విధానం ప్రవేశపెట్టిందని ఆయన చెప్పారు. దీంతో క్యాంపు కార్యాలయంలో సమర్పించిన అర్జీలను సత్వరమే ఆన్లైన్ చేయడం ద్వారా త్వరితగతిన ఆర్థిక సహాయం పొందే అవకాశం కలిగిందని ఆయన చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా సీఎం రిలీఫ్ ఫండ్ ఫైళ్లను క్షుణ్ణంగా పరిశీలించి ఆర్థిక సాయం మంజూరు చేస్తున్నదని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన 18 నెలల కాలంలో 18 విడతలుగా సీఎంఆర్ఎఫ్ మంజూరు చేయించినట్టు ఎమ్మెల్యే కవ్వంపల్లి వివరించారు. టిఆర్ఎస్ పాలనలో ప్రజల సంక్షేమాన్ని పట్టించుకోని ఆ పార్టీ నాయకులు ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం పై విమర్శలు చేస్తున్నారని ఆయన దుయ్యబట్టారు. ప్రజా సంక్షేమం, అభివృద్ధి కోసం పాటుపడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు అండదండలు అందించాలని అలాగే రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో తమ మద్దతు తెలపాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కోమటిరెడ్డి భాస్కర్ రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఎలగందుల ప్రసాద్, ఊట్కూరి వెంకటరమణారెడ్డి, మానకొండూర్ అధికార ప్రతినిధి పసుల వెంకటి, చిట్టి ఆనంద రెడ్డి, అనంతగిరి దేవస్థానచైర్మన్ అంతగిరి, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు అల్లేపు రజినీకాంత్, యాస తిరుపతి, బిగుల విజయ్, వివిధ గ్రామాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు,మాజీ ఎంపీటీసీలు మాజీ సర్పంచులు, కార్యకర్తలు లబ్ధిదారులు పాల్గొన్నారు.

# ఇంజనీరింగ్ విద్యార్థికి ఆర్థిక సాయం




**వేద న్యూస్, ఖమ్మం :**

ఖమ్మం జిల్లా వైరా లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో బీటెక్ రెండో సంవత్సరం హైదరాబాద్ హిందూ కాలేజీలో డేటా సైన్స్ చదువుతున్న ఏన్కూర్ కు చెందిన నిరుపేద విద్యార్థి కారుమంచి వినయ్ కు రూ. వేలను ఫాస్ట్ డిస్టిక్ గవర్నర్ డాక్టర్ మురళీకృష్ణ చేతుల మీదుగా శుక్రవారం గుట్టబడి స్కూల్ నందు లయన్స్ సభ్యుల మధ్య అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మార్కెటింగ్ కోఆర్డినేటర్ లగడపాటి ప్రభాకర్ రావు, జోన్ చైర్మన్ చింతోజు నాగేశ్వరరావు, లయన్స్ కంటి హాస్పిటల్ నిర్వాహకులు ఉంద్రు శ్యాంబాబు, రీజియన్ సెక్రటరీ పెనుగొండ ఉపేందర్ రావు,ఎల్ సి ఎఫ్ ఐ కోఆర్డినేటర్ చింతలపూడి వెంకటేశ్వరరావు,క్లబ్ అధ్యక్షులు వై బుచ్చి రామారావు,సెక్రటరీ చెరుకూరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# బీసీలకు 42శాతం రిజర్వేషన్ కల్పించాలి

## – రజక సంఘం అధ్యక్షుడు అలువాల ధర్మయ్య

**వేద న్యూస్,బోయినిపల్లి:**



రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కుల గణన ద్వారా బీసీలకు న్యాయం జరగాలని ఆశను వ్యక్తం చేస్తూ, రజకుల స్థాయిని గుర్తించాల్సిన అవసరం ఉందని రజక సంఘం అధ్యక్షులు అలువాల ధర్మయ్య అన్నారు. బీసీ బిడ్డలు రాజకీయంగా, విద్యా, ఉద్యోగ రంగాల్లో పురోగమించేందుకు 42 శాతం రిజర్వేషన్ అవసరమన్నారు. బీసీలు ఎవరికంటే తక్కువ కాదు. మనకూ రాజ్యాధికారం సాధించే అర్హత ఉంది. అందుకు బీసీలకు 42 శాతం రిజర్వేషన్ బిల్లు ఆమోదం కావాలి. దీనికోసం మనం ఒక్కతాటిపైకి వచ్చి పోరాడాలి అని ధర్మయ్య పిలుపునిచ్చారు. రజకులు అంటే ఏమిటో ప్రపంచానికి తెలియజెప్పేలా తమ సామర్థ్యాన్ని చాటాలని ఆయన స్పష్టం చేశారు.

# ఐజేయూ జాతీయ కౌన్సిల్ సభ్యులకు శుభాకాంక్షలు



**వేద న్యూస్, ఖమ్మం :**

ఇండియన్ జర్నలిస్టు యూనియన్ ఐజేయు జాతీయ కౌన్సిల్ సభ్యులుగా ఏకీగ్రీవంగా ఎన్నికైన టియుడబ్ల్యూజే ఐజేయు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే రామనారాయణ,యూనియన్ సీనియర్ నాయకులు నలజాల వెంకటరావు లకు యూనియన్ ఖమ్మం జిల్లా ఉపాధ్యక్షులు మోటపోతుల బాబురావు పుష్పగుచ్చం అందించి శుభాకాంక్షలు తెలియజేశారు. శుక్రవారం జిల్లా పరిషత్ మీటింగ్ హాల్లో కన్నుల పండుగగాఎన్నికైన జాతీయ కౌన్సిల్ సభ్యులకు జరిగిన అభినందన కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షులు ఏనుగు వెంకటేశ్వరరావు ప్రధాన కార్యదర్శి మైసా పాపారావులు ఆధ్వర్యంలో జిల్లా ఉపాధ్యక్షులు మోటపోతుల బాబురావు పుష్పగుచ్చం అందించి వారికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు రాష్ట్ర జిల్లా జర్నలిస్టు నేతలు పాల్గొన్నారు.

# సీఎంను కలిసిన విప్ జగదీశ్వరి

నష్టపరిహారానికి నిధులు ఇవ్వాలని, ఆశ్రమ పాఠశాలలోను, హాస్టల్ లో ఏఎన్ఎం లు, అలాగే , పీహెచ్సీ , సిహెచ్ సి లలో స్టాఫ్ నర్స్ లను నియమించాలని రిక్వెస్ట్ చేశారు. పూర్ణపాడు –లాబేసు వంతెన, పెండింగ్ పనులు త్వరగా పూర్తి చేయాలని నం. 3కి బదులు కొత్త జీవో తెచ్చి గిరిజనులకు ఆదుకోవాలని పేర్కొన్నారు. ఇంజనీరింగ్ కాలేజ్ పనులు కోసం నిధులు మంజూరు చేయాలని, మహిళా మండలి సభ్యులకు లోన్స్ ఇవ్వాలని రిక్వెస్ట్ చేశారు. సమస్యలపై సీఎం సానుకూలంగా స్పందించి త్వరలో అన్ని పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్టు జగదీశ్వరి వెల్లడించారు.

# విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు పెంపొందించాలి




## – న్యాయవాది మెతుకు హేమలత

**వేద న్యూస్, కరీంనగర్ :**

కరీంనగర్ పట్టణం ఎస్ ఆర్ డీజీ స్కూల్ ఎలక్షన్స్ లో ఎన్నుకోబడిన విద్యార్థుల ప్రమాణ స్వీకారోత్సవం ఘనంగా జరిపారు. ఈ కార్యక్రమములో ముఖ్య అతిథిగా జిల్లా కోర్టు న్యాయవాది మెతుకు హేమలత హాజరై విద్యార్థుల చేత ప్రమాణస్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న హేమలత మాట్లాడుతూ విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు పెంచుకుని భవిష్యత్తులో గొప్ప నాయకులుగా ఎదగాలని అన్నారు. ఎస్ ఆర్ స్కూల్ జోనల్ ఇన్చార్జి శశిధర్ మాట్లాడుతూ ఎన్నికలపై అవగాహన పెంచి, నాయకత్వ లక్షణాలు పెంపొందించడానికి ఈ కార్యక్ర మాలు నిర్వహిస్తామని అన్నారు. ప్రిన్సిపల్ మానస మాట్లాడుతూ విద్యార్థులు ఎన్నికల విదానం పై అవగాహన పెంచుకుని భావి భారత పౌరులుగా ఎదగాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జ్ లావణ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# భద్రకాళి ఆలయానికి పోటెత్తిన భక్తులు



- టెంపుల్‌లో ప్రత్యేకంగా వరలక్ష్మి వ్రతం పూజలు
- శ్రావణ శుక్రవారం సందర్భంగా అధిక సంఖ్యలో హాజరు

**వేద న్యూస్, వరంగల్ :**

శ్రావణ మాసం వరలక్ష్మీవ్రతం శుక్రవారం సందర్భంగా భక్తులు భద్రకాళి అమ్మవారిని దర్శించుకోవడానికి దేవాలయానికి పోటెత్తారు. భక్తులు భక్తిశ్రద్ధలతో ఒడిబియ్యం పోసి అమ్మవారికి చీరలు సమర్పించారు. భక్తులు ఉదయం నుండి అమ్మవారి దర్శనమునకు బారులు తీరారు. భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక క్యూలైన్లు, మంచినీరు, ప్రసాద వితరణ ఏర్పాట్లు దేవాలయ చైర్మన్ డాక్టర్ బి. శివసుబ్రహ్మణ్యమ్, ధర్మకర్తలు తొనుపునూరి వీరన్న, గాదె శ్రవణ్కుమార్ రెడ్డి, మోతుకూరి మయూరిరామేశ్వర్రావు, గాండ్ల స్రవంతి, తొగరు క్రాంతి, ఓరుగంటి పూర్ణచందర్, పాలడుగుల ఆంజనేయులు, బింగి సతీష్, అనంతుల శ్రీనివాస్ రావు, జారతి వెంకటేశ్వర్లులు పర్యవేక్షించారు భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా అన్ని ఏర్పాట్లు ఆలయ ఈఓ రామల సునీత ఏర్పాటు చేశారు. అమ్మవారి దర్శనం అనంతరం ముత్తయిదువలు వాయినాలు ఇచ్చుకున్నారు. అమ్మవారిని వరంగల్ పశ్చిమ నియోజక వర్గ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి, మాజీ ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయభాస్కర్ దంపతులు దర్శించుకున్నారు. పూజానంతరం అర్చకులు మహదాశీర్వచనం నిర్వహించి అమ్మవారి శేషవస్త్రములు బహూకరించి ప్రసాదములు అందజేశారు.

# ఉరి వేసుకుని యువతి ఆత్మహత్య

**వేద న్యూస్, చొప్పదండి :**



పెద్దలు కుదిర్చిన పెళ్ళి ఇష్టం లేక యువతి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన చోటు చేసుకుంది. చొప్పదండి పట్టణం జ్యోతినగర్‌కి చెందిన వనపర్తి సంధ్య(27) అనే యువతి పెద్దలు కుదిర్చిన పెళ్లి ఇష్టం లేక శుక్రవారం ఉదయం వారి ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నది. ఇట్టి విషయం పై మృతురాలి తండ్రి కనుకయ్య పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చొప్పదండి ఎస్ఐ నరేష్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

# గంజాయి తాగుతున్న వ్యక్తుల అరెస్ట్

**వేద న్యూస్, మడికొండ :**

మడికొండ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న వెస్ట్ సిటీ పోచమ్మ గుడి వద్ద ఇద్దరు వ్యక్తులు గంజాయి తాగుతున్నారనే సమాచారంతో మడికొండ ఎస్సై రాజ్ కుమార్, అతని సిబ్బంది తో కలిసి దాడి చేయగా అక్కడ ఇద్దరు వ్యక్తులు బాస్కె వంశీ, నల్లాల భాస్కర్ గంజాయి తాగుతూ పట్టుబడగా వారి వద్ద నుండి 50గ్రాముల గంజాయి, 2 సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్ కు తరలించామని, మడికొండ పోలీస్ ఇన్స్పెక్టర్ పి. కిషన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారన్నారు. ఈ సందర్భంగా ఇన్స్పెక్టర్ కిషన్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం యువత చెడు దోవ పట్టకుండా రాష్ట్ర ప్రభుత్వం, పోలీస్ శాఖ ఆధ్వర్యంలో కలిసి మత్తు పదార్థ రహిత రాష్ట్రంగా చేయడం కోసం అహర్నిశలు కష్టపడుతున్నామన్నారు. అందువలన యువత గంజాయి ఇతర దురాలవాట్ల జోలికి పోకుండా ఆరోగ్యం కాపాడుకోవాలని సూచించారు. ఎవరైనా గంజాయి కి సంబందించిన సమాచారం ఉంటే పోలీస్ వారికి తెలపాలని సమాచారం ఇచ్చిన వారి వివరాలు గొప్యంగా ఉంచుతామని ఇన్స్పెక్టర్ కిషన్ తెలిపారు.

# శ్రీ చైతన్య పాఠశాలలో ముందస్తు రక్షా బంధన్

**వేద న్యూస్, ఎల్లారెడ్డిపేట :**

ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని శ్రీ చైతన్య పాఠశాలలో బిజెవైఎం మండల ప్రధాన కార్యదర్శి దయాకర్ రెడ్డి ఆధ్వర్యంలో ముందస్తు రక్షా బంధన్ వేడుకలు ఘనంగా జరిగాయి. పాఠశాల విద్యార్థులకు, బి జె వై ఎం నాయకులు విద్యార్థినులు రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు,బి జె వై ఎం నాయకులు ఒకరి కొకరు నీకు నేను రక్షా నాకు నువ్వు రక్షా మనిద్దరం దేశానికి రక్షా, ధర్మానికి రక్షా అంటూ ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం మండల ప్రధాన కార్యదర్శి మార్పు దయాకర్ రెడ్డితో పాటు ప్రశాంత్, నవీన్, వినయ్ రెడ్డి, చందు, నిమ్మల సాయి, రమేష్ మాచర్ల, రాకేష్ యాదవ్, ప్రశాంత్, కార్యక్రమంలో పాల్గొన్నారు.



Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073